

నాన్‌'లోకల్‌' ఎక్కడ?

రాష్ట్ర సరిహద్దు కృష్ణా ప్రాంతంలో కన్నడ మీడియం విద్య ప్రశ్నార్థకంగా మారింది.

వివరాలు 8లో ▸



ప్రపంచ దేశాల్లో శాంతి కరువు

ప్రపంచంలోని ఏ దేశంలో చూసినా శాంతి కరువైందని ప్రొ. హరగోపాల్‌ అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
41.9 /24.6

వాతావరణం

ఉదయం, సాయంత్రం ఆకాశం స్వల్పంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత, ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్‌

27న ప్రవేశ పరీక్ష

కొత్తకోట రూరల్‌: మండలంలోని **అమడ** బాకుల మోడల్‌ స్కూల్‌లో 6వ **తరగతి** ప్రవేశం కోసం ఈ నెల 27న అర్హత **పరీక్ష, 7, 8, 9, 10** తరగతుల్లో ఖాళీ సీట్ల **భర్తీ కోసం** ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు **ప్రిన్సిపాల్‌** మల్లికార్జున్‌గౌడ్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశం కోసం పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని, అలాగే 7, 8, 9, 10 తరగతుల వారికి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. సోమవారం నుంచి హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్‌ చేసుకోవాలని సూచించారు.

20 మంది టీచర్లకు స్పౌజ్‌ బదిలీలు

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: 317 జీఓలో గతంలో ఇబ్బందులకు గురైన స్పౌజ్‌ ఉపాధ్యాయులకు త్వరలో బదిలీ చేయాలని ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. భార్య ఒక జిల్లాలో, భర్త మరో జిల్లాలో విధులు నిర్వహిస్తున్న వారు గతంలో తమకు బదిలీ చేయాలని దరఖాస్తులు చేసుకున్నారు. ఇటీవల మంత్రి వర్గ ఉపసంఘం ఈ అంశంపై నిర్ణయం తీసుకుని బదిలీలకు ఆమోదం తెలిపింది. మొత్తంగా మహబూబ్‌నగర్‌ జిల్లాకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి మొత్తం 20 మంది బదిలీపై రానున్నారు. పాత ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన రంగారెడ్డి, వికారాబాద్‌, నారాయణపేట, గద్వాల జిల్లాల నుంచి మహబూబ్‌నగర్‌కు బదిలీ కానున్నారు. కాగా 8 మంది టీచర్లు ఇక్కడి నుంచి ఇతర జిల్లాలకు బదిలీ కానున్నారు. ఇటీవల డీఎస్సీ ద్వారా ప్రభుత్వం చాలా పోస్టులు భర్తీ చేసింది. ఖాళీలు ఎక్కువ లేని క్రమంగా మహబూబ్‌నగర్‌ జిల్లాకు వచ్చే ఉపాధ్యాయులకు బై పోస్టుల కింద భర్తీ చేయాలని ప్రభుత్వం సూచించింది. ఈ విషయంపై డీఈఓ ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. 20 మంది ఉపాధ్యాయులకు అన్ని పరిశీలించి ఈ నెల 22లోగా బదిలీ ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

కబడ్డీ అసోసియేషన్‌ నూతన కార్యవర్గ ఎన్నిక



వనపర్తి టౌన్‌: జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లాకేంద్రంలో ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ అడ్‌హాక్‌ కమిటీ చైర్మన్‌, ఉమ్మడి మహబూబ్‌గర్‌ జిల్లా ఒలింపిక్‌ అసోసియేషన్‌ సెక్రటరీ కురుమూర్తిగౌడ్‌ పర్యవేక్షణలో జరిగిన ఎన్నికకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్‌ సభ్యులు కె.జగదీశ్వర్‌యాదవ్‌, రాష్ట్ర కార్యదర్శి మహేందర్‌రెడ్డి హాజరు కాగా.. ఎన్నికల అబ్జర్వర్‌గా నర్సింహులు వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ప్రధాన కార్యదర్శిగా కుర్మయ్య, అధ్యక్షుడిగా పి.వెంకటేశ్వర్‌రెడ్డి, చైర్మన్‌గా పద్మజారెడ్డి, కోశాధికారిగా గోపాల్‌, ఉపాధ్యక్షులుగా దామోదర్‌, అశోక్‌, వెంకటయ్య, సురేష్‌, వెంకటేష్‌, సంయుక్త కార్యదర్శులుగా తిరుపతయ్య, చంద్రశేఖర్‌గౌడ్‌, కిషోర్‌, నాగరాజు, కమలాకర్‌, కార్య నిర్వాహక కార్యదర్శులుగా మద్దిలేటి, వెంకటరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా సభ్యుడు బాల రాజయ్య, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అద్దె బస్సుల డ్రైవర్ల సమ్మె విరమణ

అచ్చంపేట: అచ్చంపేట ఆర్టీసీ డిపో ఎదుట గత ఐదురోజులుగా అద్దె బస్సుల ప్రైవేట్‌ డ్రైవర్లు చేపట్టిన సమ్మె ఆదివారం ముగిసింది. కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, అద్దె బస్సుల యాజమాన్యం డ్రైవర్ల శ్రమ దోపిడీని అరికట్టాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హయ్యర్‌ అద్దె బస్సు డ్రైవర్స్‌ యూనియన్‌ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. సమ్మెతో దిగివచ్చిన యాజమాన్యాలు డ్రైవర్లకు గతం కంటే రూ.3 వేలు ఎక్కువ ఇచ్చేందుకు అంగీకరించారు. జీతాలు పెరగడంతో డ్రైవర్లు సమ్మె విరమించి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్‌నాయక్‌, అద్దె బస్సు ప్రైవేట్‌ డ్రైవర్ల నియోజకవర్గ అధ్యక్షుడు సుధాకర్‌ మాట్లాడుతూ అద్దె బస్సు యాజమాన్యం చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించారని చెప్పారు. సమ్మె చేయడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు కలగడంతో ఆర్టీసీ డీఎం జోక్యం చేసుకొని యాజమాన్యాలతో చర్చలు జరపడం వల్ల వేతనాలు పెరిగాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, శ్రీహరి, అనిల్‌, నాగరాజు, బాలయ్య, చంద్రయ్య, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

స్థాయికి మించి..

అన్నిరకాల వైద్యం అందిస్తున్న ఆర్‌ఎంపీలు, పీఎంపీలు



ఆత్మకూర్‌లో ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిని సీజ్‌ చేస్తున్న డీఎంహెచ్‌ఓ (ఫైల్‌)

- జిల్లాలో యథేచ్ఛగా అనుమతి లేని ఆస్పత్రుల నిర్వహణ
- చదివింది బీఎంఎస్‌.. చేసేది ఎంబీబీఎస్‌ వైద్యం
- ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దందా
- పూర్తిస్థాయిలో అరికట్టలేకపోతున్న అధికార యంత్రాంగం

అమరచింత: జిల్లాలో కొందరు అనుమతి లేని నర్సింగ్‌ హోంలు, ఇతరత్రా క్లినిక్‌లు కొనసాగిస్తున్నారు. బీఎంఎస్‌ చదివిన వారు ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో ఎంబీబీఎస్‌గా అవతారం ఎత్తి స్థాయికి మించి వైద్యం చేస్తూ.. ప్రజల ప్రాణాలను హరిస్తున్నారు. గైనిక్‌లు లేకున్నా ప్రసూతి కేంద్రాలు నిర్వహిస్తూ.. తల్లీబిడ్డల చావులకు కారణమవుతున్నారు. ఇటీవల ఆత్మకూర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో నవజాత శిశువు మృతిచెందిన సంఘటన తెలిసిందే. అయితే ఇలాంటి ఘటనలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఈ క్రమంలోనే డీఎంహెచ్‌ఓ ప్రైవేట్‌ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్‌ సెంటర్లపై ఆకస్మికంగా దాడులు నిర్వహించి ఓ నర్సింగ్‌హోంను సీజ్‌ చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా..

జిల్లాలోని 255 గ్రామాల్లో సుమారు 770 కిపైగా ఆర్‌ఎంపీ, పీఎంపీలు క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. వీరు కేవలం తమ వద్దకు వైద్యం కోసం వచ్చిన వారికి ఎలాంటి వైద్యం కావాలో గ్రహించి వారిని సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లమని సలహా ఇవ్వాలి. కానీ, నిబంధనలకు విరుద్ధంగా వారే నేరుగా ఇంజెక్షన్లు, మాత్రలు ఇవ్వడం, కొన్ని సందర్భాల్లో అంతకు మించి వైద్యం చేస్తున్నారనే ఫిర్యాదులు లేకపోలేదు. గ్రామీణ ప్రాంత ప్రజల అమాకత్వాన్ని ఆసరాగా చేసుకుని తమ దందా సాగిస్తున్నారు. కొందరు ప్రభుత్వ వైద్యులు సైతం ప్రైవేట్‌గా ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు.

అయితే జిల్లాలో ఈ చర్యలు పూర్తిస్థాయిలో అక్రమార్కులకు అడ్డుకట్ట వేయలేకపోతున్నాయి.

అధునాతన వసతులతో..

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధునాతన వసతులతో వైద్య సేవలు అందుబాటులో ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. మండల కేంద్రాల్లోనే కాకుండా పల్లెల్లో సైతం ప్రభుత్వ ఆస్పత్రులు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొంటున్నారు. అలాగే ఆయా ఆస్పత్రుల్లో 156 రకాల మందులు సైతం అందుబాటులో ఉంచుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానికంగానే అన్నిరకాల వైద్యం అందిస్తున్నారు. గ్రామాల్లోని ఆశా వర్కర్‌తోపాటు ఏఎన్‌ఎంలు సైతం తమ క్లస్టర్‌ పరిధిలోని ప్రజలకు ఎలాంటి వైద్యం అందించాలో అన్న విషయాలను ముందస్తుగానే గుర్తించి వారిని ఆస్పత్రులకు తీసుకెళ్తూ వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

నోటీసులు ఇచ్చాం..

జిల్లాలో అనుమతులు లేకుండా ప్రైవేట్‌ ఆస్పత్రులు నిర్వహిస్తున్న వారికి నోటీసులు ఇచ్చాం. ఇప్పటికే జిల్లాకేంద్రంతోపాటు పెబ్బేరు, ఆత్మకూర్‌, అమరచింతలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాం. వీటిలో రెండు ప్రైవేట్‌ ఆస్పత్రులను సీజ్‌ చేశాం. అలాగే ప్రైవేట్‌ ఆస్పత్రులు నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్యులకు సైతం సూచనలు చేశాం.

– శ్రీనివాసులు, డీఎంహెచ్‌ఓ

ప్రతి మండలానికి..

మాతాశిశు సంరక్షణ్‌ ఆధ్వర్యంలో ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. గర్భిణిగా ధ్రువీకరించినప్పటి నుంచి ప్రసూతి అయ్యే వరకు ఎప్పుడు ఎలాంటి వైద్య సేవలు అందించాలి అన్న విషయాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ.. స్కానింగ్‌ పరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లే సదుపాయం కల్పించారు. దీంతో అంగన్‌వాడీ టీచర్‌ నుంచి ఏరియా ఆశ వర్కర్‌, ఏఎన్‌ఎంలు గర్భిణికి అన్నిరకాలుగా సహాయ, సహకారాలు అందిస్తున్నారు. కాన్పులకు ముందస్తుగా వైద్యుల సూచనలతో జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లి తల్లీబిడ్డ క్షేమంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.



పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లిలో తడిసిన వరిధాన్యం

ఈదురుగాలుల బీభత్సం

- జిల్లాలోని పలు ప్రాంతాల్లో అకాల వర్షాలు
- గోపాల్‌పేట మండలంలో పిడుగుపడి 25 గొర్రెలు మృతి

గోపాల్‌పేట/ మదనాపురం: జిల్లాలో ఆదివారం ఈదురుగాలులు, అకాల వర్షాలు బీభత్సం సృష్టించాయి. ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో ఆదివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో వీచిన భారీ గాలి, అకాల వర్షానికి తీవ్రనష్టం వాటిల్లింది. గోపాల్‌పేటలోని కోదండరామస్వామి ఆలయం వద్ద ఆరబోసిన వడ్లు, వాటిపై కప్పిన కవర్లు గాల్లోకి ఎగిరిపోయాయి. చాకల్‌పల్లి, లక్ష్మీదేవిపల్లి గ్రామాల మధ్యలో పిడుగుపడి మండ్ల విశ్వనాథం, బోయ రాములుకు చెందిన 25 గొర్రెలు మృత్యువాత పడగా.. ఇద్దరు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. మృతిచెందిన గొర్రెల విలువ రూ.4 లక్షలు ఉంటుందని బాధితులు వాపోయారు. బుద్దారంలో చెట్టు విరిగి విద్యుత్‌ స్తంభంపై పడటంతో మూడు ముక్కలైంది. గోపాల్‌పేటలోని అంబేద్కర్‌ కాలనీలో హైమాస్ట్‌ లైట్ల పోల్‌ ఒరిగిపోయింది. మామిడి కాయలు పెద్దమొత్తంలో రాలిపోయాయి. మదనాపురం మండల కేంద్రంలోని కొత్తకోట రహదారిలో చెట్టు విరిగిపడి కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే ముందు షెడ్డు కూలిపడింది. దుప్పల్లిలో సోలార్‌ విద్యుత్‌ లైట్‌ కిందపడింది. పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో అకాల వర్షానికి వరిధాన్యం తడిసిముద్దయ్యింది.



మదనాపురం మండలం దుప్పల్లిలో సోలార్‌ లైట్‌ కిందపడింది



చాకల్‌పల్లిలో పిడుగుపడి మృతిచెందిన గొర్రెలు

సంవిధాన్‌ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్‌ రూరల్‌: జై బాపు, జైభీమ్‌, జై సంవిధాన్‌ అభియాన్‌ నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాష్ట్ర ఎక్సైజ్‌, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం కొల్లాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో జై బాపు, జైభీమ్‌, జై సంవిధాన్‌ అభియాన్‌ కార్యకర్తలతో నిర్వహించిన సన్నాహక సమావేశం మంత్రి పాల్గొని మాట్లాడారు. నాగర్‌కర్నూల్‌ జిల్లాలోని అన్ని గ్రామాల్లో పాదయాత్రలు చేసే విధంగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అందరూ కలిసికట్టుగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్‌ పార్టీ చేసిన సేవలు, చేసిన అభివృద్ధి, అదేవిధంగా రాష్ట్రంలో ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం ఏ విధంగా రాజ్యాంగాన్ని అవమానపరుస్తుంది.. వ్యవస్థలను ఎలా నిర్వీర్యం చేస్తుంది.. అప్రజాస్వామిక నిర్ణయాలు, తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కోరారు. అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేస్తున్నానని చెప్పారు. ఇందులో భాగంగా రూ.5 కోట్ల నియోజకవర్గ నిధుల నుంచి రూ.2 కోట్లు గ్రంథాలయాలు, క్రీడల అభివృద్ధికి వెచ్చిస్తానని ప్రకటించారు. ప్రతి గ్రామానికి రూ.లక్ష చొప్పున గ్రంథాలయాలకు కేటాయించామన్నారు. అంబేద్కర్‌, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, మహాత్మగాంధీ వంటి మహనీయుల జీవిత చరిత్ర, వారి ఆశయాలు, సిద్ధాంతాలు తెలిపే పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు.

ప్రారంభమైన ఓపెన్‌ ఇంటర్‌, ఎస్సెస్సీ పరీక్షలు

వనపర్తి విద్యావిభాగం: జిల్లాలో ఓపెన్‌ ఎస్సెస్సీ, ఇంటర్‌ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లాకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష సెంటర్‌–ఏలో 156 మంది విద్యార్థులకు గాను 133 మంది హాజరవగా 23 మంది గైర్హాజరయ్యారు. అలాగే సెంటర్‌–బీలో 192కి గాను 170 మంది హాజరు కాగా 22 మంది గైర్హాజరు, జెడ్పీహెచ్‌ఎస్‌ బాలుర కేంద్రంలో 223 మందికి విద్యార్థులకు 205 మంది హాజరు కాగా 28 మంది గైర్హాజరయ్యారని, జూనియర్‌ కళాశాలలో 229 మందికి గాను 203 మంది హాజరు కాగా 26 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ ఎర్ర అంజయ్య తెలిపారు.

రంగనాథాలయంలో న్యాయమూర్తి పూజలు



వనపర్తి రూరల్‌: జిల్లాలోని శ్రీరంగాపురంలో ప్రసిద్ధిగాంచిన శ్రీరంగనాథ స్వామి ఆలయాన్ని ఖమ్మం జిల్లా న్యాయమూర్తి రాజగోపాల్‌ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ ప్రాముఖ్యతను వివరించి ప్రత్యేక అర్చన చేశారు. తీర్థ ప్రసాదాలను అందించి ఆశీర్వచనాలు అందించారు.

'ప్రతి గింజను కొనుగోలు చేస్తాం'



మాందాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్‌ విష్ణువర్ధన్‌రెడ్డి

పాన్‌గల్‌: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని డీసీసీబీ చైర్మన్‌ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ గోవర్ధన్‌ అన్నారు. ఆదివారం మండలంలోని దావాజిపల్లి, మాందాపూర్‌, బుసిరెడ్డిపల్లి, కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి గ్రామాల్లో సింగిల్‌ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ధాన్యం సేకరణలో రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతోపాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ చెల్లిస్తామన్నారు. కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని రకాల వసతులు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు కలిగిస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో విండో వైస్‌ చైర్మన్‌ బాలయ్య, సీఈఓ భాస్కర్‌గౌడ్‌, రైతులు పాల్గొన్నారు.

లేబర్‌ కోడ్‌ చట్టాలను రద్దు చేయాలి

నాగర్‌కర్నూల్‌ రూరల్‌: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్‌ కోడ్‌ చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్‌ అధ్యక్షతన నిర్వహించిన సార్వత్రిక సమ్మె సన్నాహక సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మికులు సాధించుకున్న 44 చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్‌ కోడ్‌లుగా విభజించేందుకు ప్రయత్నించిందని, ఇది సరికాదన్నారు. కార్మిక సంఘాలు పెట్టుకునే హక్కు లేకుండా, ప్రభుత్వాలను ప్రశ్నించకుండా ఈ లేబర్‌ కోడ్‌లు ఉపయోగపడతాయన్నారు. దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టి కేంద్ర ప్రభుత్వం విధానాన్ని ఎండగడతామన్నారు. ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేస్తూ పెట్టుబడిదారులకు అప్పగిస్తే సామాన్యుడికి రిజర్వేషన్‌ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేవారు. దేశంలో ప్రజలను చైతన్యవంతులుగా చేసి మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపే దాకా ప్రజా ఉద్యమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి పర్వతాలు, నాయకులు ఈశ్వర్‌, దశరథం, రామయ్య, సత్యం, బాలపీరు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న కార్మిక సంఘాల నాయకులు

ఎండీసీఏ మైదానంలో 'టర్ఫ్‌ వికెట్‌'

- త్వరలో మూడు పిచ్‌లు అందుబాటులోకి..
- మైదానం మొత్తం గ్రీనరీ ఏర్పాటు
- భవిష్యత్‌లో రంజీ మ్యాచ్‌లకు వేదిక కానున్న పాలమూరు

మహబూబ్‌నగర్‌ క్రీడలు: మహబూబ్‌నగర్‌ జిల్లా క్రికెట్‌ సంఘం (ఎండీసీఏ) ఆధ్వర్యంలో టర్ఫ్‌ వికెట్‌ పిచ్‌లు సిద్ధం చేస్తున్నారు. జిల్లాకేంద్రం పిల్లలమర్రి సమీపంలోని ఈ మైదానంలో క్రీడాకారుల సౌకర్యార్థం చాలా వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. రాష్ట్రంలో హైదరాబాద్‌ తర్వాత హైదరాబాద్‌ క్రికెట్‌ అసోసియేషన్‌(హెచ్‌సీఏ)కు ఉన్న ఏకైక క్రీడా మైదానమిది. ఇప్పటికే ఇక్కడ క్రీడాకారుల ప్రాక్టీస్‌ కోసం దాతల సహకారంతో నెట్‌, రెండు బౌలింగ్‌ యంత్రాలతో పాటు పెవిలియన్‌ భవనాన్ని ఏర్పాటు చేశారు.

■ క్రికెట్‌లో టర్ఫ్‌ వికెట్‌(పిచ్‌)లకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. కేవలం మ్యాట్ల మీద క్రికెట్‌ ఆడే క్రీడాకారులకు టర్ఫ్‌ వికెట్‌పై ఆడాలంటే మెరుగైన ప్రాక్టీస్‌ ఉండాల్సిందే. చాలా రోజులుగా ఎదురు చూస్తున్న ఔత్సాహిక ఉమ్మడి జిల్లా క్రికెట్‌ క్రీడాకారులకు కల నెరవేరనుంది. గతేడాది ఎండీసీఏ మైదానంలో వేసవి క్రికెట్‌ శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో పలువురు హెచ్‌సీఏ ప్రతినిధులు పాల్గొనగా మైదానంలో టర్ఫ్‌ వికెట్‌ ఏర్పాటు కోసం ఎండీసీఏ ప్రతినిధులు వారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో హెచ్‌సీఏ రూ.60 లక్షలు కేటాయించగా.. కొన్ని రోజులుగా పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అదే విధంగా మైదానం మొత్తం పచ్చగడ్డి (గ్రీనరీ)ని ఏర్పాటు చేస్తున్నారు. మైదానంలో వర్షపు నీరు నిలువకుండా ఎత్తు పెంచి చుట్టూ అండర్‌గ్రౌండ్‌ పైప్‌లైన్‌ వేస్తున్నారు. త్వరలో ఎండీసీఏ మైదానంలో మూడు టర్ఫ్‌ వికెట్‌ పిచ్‌లు అందుబాటులోకి రానున్నాయి.

■ టర్ఫ్‌ వికెట్‌ పిచ్‌పైనే జాతీయ, అంతర్జాతీయస్థాయిలో మ్యాచ్‌లు ఆడుతారు. ఇంతకాలం మ్యాట్‌పై ఆడే జిల్లా క్రీడాకారులు టర్ఫ్‌ వికెట్‌ అందుబాటులోకి వస్తే వారి ఆటతీరు మరింత మెరుగు పడే అవకాశం ఉంటుంది. హెచ్‌సీఏ రాష్ట్రస్థాయి టోర్నీల్లో జిల్లా క్రీడాకారులు మరింతగా రాణించవచ్చు. రంజీస్థాయిలో ఆడేలా జిల్లా క్రీడాకారులను తీర్చిదిద్దవచ్చు. ఎండీసీఏ మైదానంలో టర్ఫ్‌ వికెట్‌ ఏర్పాటయితే భవిష్యత్‌లో రాష్ట్రస్థాయి మ్యాచ్‌లతో పాటు రంజీ మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది.




టర్ఫ్‌ వికెట్‌ పిచ్‌పై నాటిన గడ్డి



రూపుదిద్దుకుంటున్న ఎండీసీఏ మైదానం

చురుగ్గా సాగుతున్న పనులు..



ఎండీసీఏ మైదానంలో టర్ఫ్‌ వికెట్‌ పిచ్‌ ఏర్పాటు చేయాలనే కల నెరవేరబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. గతేడాది హెచ్‌సీఏ అపెక్స్‌ కౌన్సిల్‌కు టర్ఫ్‌ వికెట్‌ కోసం విన్నవించగా వారు సానుకూలంగా స్పందించారు. మైదానంలో టర్ఫ్‌ వికెట్‌ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. క్రీడాకారులకు మెరుగైన క్రికెట్‌ శిక్షణ లభిస్తుంది. హెచ్‌సీఏ అపెక్స్‌ కౌన్సిల్‌కు కృతజ్ఞతలు

– ఎం.రాజశేఖర్‌, ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

బైక్‌లో చెలరేగిన మంటలు

- కిందపడి ఒకరి దుర్మరణం.. మరొకరికి తీవ్రగాయాలు


దగ్ధమైన బైక్

వంగూరు: ఊహకు అందని విధంగా ఒక్కసారిగా బైక్‌లో మంటలు చెలరేగడంతో అదుపుతప్పి కిందపడింది. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరిలో ఒకరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన వంగూరు స్టేజీ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ వివరాల మేరకు.. హైదరాబాద్ మెహదీపట్నానికి చెందిన జునాయత్ (27) ఇబ్రహీంలు బైక్‌పై శ్రీశైలం బయల్దేరారు. మార్గమధ్యంలోని వంగూరు స్టేజీ సమీపంలోకి చేరుకున్న బైక్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో బైక్ నడుపుతున్న జునాయత్ మంటల నుంచి తప్పించుకునే క్రమంలో అదుపుతప్పి కిందపడటంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇబ్రహీంకు తీవ్రగాయాల కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. బైక్ పూర్తిగా దగ్ధమైంది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిన్నచింతకుంట: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని ఉంద్యాల సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాంలాల్‌నాయక్ కథనం మేరకు.. మక్తల్ మండలం వనైకుంటకు చెందిన ఊట్కూర్ ఆశప్ప (55) ఆదివారం తన ద్విచక్ర వాహనంపై ఉంద్యాలలోని బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి హాజరయ్యాడు. కార్యక్రమం ముగించుకొని తిరిగి వెళ్తుండగా గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. గమనించిన గ్రామస్తులు వెంటనే బంధువులు, కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి 108 వాహనంలో చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన ఆటో.. డ్రైవర్ దుర్మరణం

మహమ్మదాబాద్: ఎదురెదురుగా టిప్పర్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన మహమ్మదాబాద్ మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. హన్వాడ మండలం షేక్‌పల్లి ఎల్లంబాయి తండాకు చెందిన సునీల్ (20) ఆటో తీసుకుని షేక్‌పల్లి నుంచి మహమ్మదాబాద్ వైపు వస్తుండగా.. నంచర్ల క్రాస్‌రోడ్డు వద్ద టైరు పగిలింది. ఈ క్రమంలో ఆటో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న టిప్పర్ వైపు దూసుకెళ్లి ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ సునీల్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

మృతదేహం లభ్యం

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని నల్లచెరువులో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ వివరాల మేరకు.. నల్లచెరువులో వ్యక్తి మృతదేహాన్ని గమనించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని వెలికితీశారు. సదరు వ్యక్తి వయసు 40 ఏళ్లు ఉంటాయని, నాలుగు రోజుల క్రితం చెరువులో పడి ఉంటాడని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని జిల్లా మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. ఆ వ్యక్తి గోదుమ కలర్ నలుపు గీతల షర్ట్, నీలం రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడని.. ఎవరైనా గుర్తిస్తే 87126 70612 నంబర్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

నాన్‌'లోకల్' ఎక్కడ.?

తెలంగాణలో కన్నడ మీడియం.. ప్రశ్నార్థకం


కృష్ణాలోని కన్నడ మీడియం ఉన్నత పాఠశాల

- స్థానికత కోసం కర్ణాటకకు ఇక్కడి విద్యార్థులు
- రాష్ట్ర సరిహద్దులో ఆదరణ కోల్పోతున్న పాఠశాలలు
- ఇప్పటికే రెండు ప్రాథమిక పాఠశాలలు మూత

కృష్ణా: రాష్ట్ర సరిహద్దులోని కృష్ణా మండలం విభిన్న సంస్కృతీ సంప్రదాయాలకు నిలయం. ఇక్కడి ప్రజల వేషం, భాష, అలవాట్లు భిన్నంగా ఉంటాయి. అందుకే కృష్ణా మండలాన్ని మినీ ఇండియాగా కూడా పిలుస్తారు. ఇక్కడ నివసించే ప్రజలు వందకు 70 శాతం మంది కన్నడ భాషలో మాట్లాడుతారు. ప్రజల మాతృభాషకు అనుగుణంగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మండలంలోని ప్రతి గ్రామంలో కన్నడ మీడియం పాఠశాలలను ఏర్పాటు చేసింది. ఇక్కడ కన్నడ మీడియం చదివిన విద్యార్థులు ఉన్నత చదువుల నిమిత్తం తప్పనిసరిగా కర్ణాటకకు వెళ్లాల్సి ఉంటుంది. ఎందుకంటే ఇక్కడ కేవలం పదోతరగతి వరకు మాత్రమే కన్నడ మీడియం ఉంది. మిగతా ఉన్నత చదువులు చదివేందుకు తెలంగాణలో ఎక్కడా అవకాశం లేకపోవడంతో కర్ణాటకకు వెళ్లక తప్పని పరిస్థితి ఉంది. అయితే తెలంగాణ రాష్ట్రంలో ఏ ఉద్యోగ పోటీ పరీక్షలు రాయాలన్నా ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇక్కడ చదివి ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. దీంతో కర్ణాటకలో ఇంటర్ చదివిన విద్యార్థులు స్థానికతను కోల్పోతున్నారు. అటు కర్ణాటకలోనూ ఇవే నిబంధనలు ఉన్నాయి. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు స్థానికత అవసరం ఉంటుంది. ఇక్కడ పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో నాన్‌లోకల్ కిందకు వస్తున్నారు. అక్కడ, ఇక్కడ విద్య, ఉద్యోగ అవకాశాలు రాక మధ్యలోనే చదువులు నిలిపివేస్తున్నారు.

కన్నడ మీడియంలో 871 మంది విద్యార్థులు..

కృష్ణా ఉన్నత పాఠశాలలో 270 మంది, తంగిడి ప్రాథమికోన్నత పాఠశాలలో 170, చేగుంటలో 120, క్రిష్ణ ప్రాథమిక పాఠశాలలో 60, గుర్జాల్‌లో 70, కుసుమర్తిలో 40, ఐనాపూర్‌లో 36, హిందూపూర్ 80, గుడెబల్లూర్‌లో 25 మందితో కలిపి మొత్తం 871 మంది విద్యార్థులు కన్నడ మీడియం చదువుతున్నారు. ప్రతి విద్యాసంవత్సరం 200 నుంచి 250 మంది విద్యార్థులు 10వ తరగతి పూర్తి చేసుకొని ఉన్నత చదువులకు కర్ణాటకకు వెళ్తుంటారు. వీరిని అక్కడ నాన్‌లోకల్‌గా పరిగణిస్తున్నారు. తెలంగాణలోనూ నాన్‌లోకల్ కింద రాష్ట్ర ప్రభుత్వం పరిగణిస్తుంది. దీంతో చాలా మంది విద్యార్థులు ప్రతిభ ఉన్నప్పటికీ.. నాన్‌లోకల్ కారణంగా విద్య, ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారు.

కృష్ణా స్కూల్‌కు రూ. 10లక్షలు మంజూరు..

కృష్ణాలోని కన్నడ మీడియం ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం కర్ణాటక ప్రభుత్వం రూ. 10లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో భవన నిర్మాణం పూర్తయింది. దీంతోపాటు కన్నడ భాషకు సంబంధించిన పాఠ్య పుస్తకాలను ప్రతి సంవత్సరం కర్ణాటక ప్రభుత్వం కృష్ణా మండలంలోని కన్నడ మీడియం పాఠశాలలకు సరఫరా చేస్తోంది.

గడినాడ ఉద్యమంతో కర్ణాటక ప్రభుత్వంలో చలనం..

కన్నడ భాషపై అభిమానంతో ఈ ప్రాంతంలోని నాయకులు, ఉపాధ్యాయులు గడినాడ (రాష్ట్ర సరిహద్దులోని ప్రాంతం) కన్నడ సంఘం ఏర్పాటు చేసుకొని కర్ణాటక ప్రభుత్వంతో అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. ఫలితంగా కొంతకాలం క్రితం కన్నడ మీడియం చదివిన ఇతర రాష్ట్ర విద్యార్థులకు కర్ణాటకలో విద్య, ఉద్యోగ అవకాశాల్లో 5శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని అక్కడి ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఈ మేరకు కర్ణాటక ప్రభుత్వం 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోవడంతో గడినాడ కన్నడిగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.


కర్ణాటక ప్రభుత్వ నిధులతో కృష్ణా పాఠశాలలో నిర్మించిన అదనపు గదులు

ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నాం..



నేను 1994–95లో కృష్ణా ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకొని కర్ణాటకలోని రాయచూర్‌లో ఉన్నత విద్యాభ్యాసం పూర్తిచేశాను. 1998లో టీటీసీ చేసేందుకు ప్రయత్నించగా.. అక్కడి ప్రభుత్వం నాన్‌లోకల్ కారణంగా టీటీసీలో అవకాశం కల్పించలేదు. 2002లో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం రాగా.. అప్పుడు కూడా నాన్‌లోకల్ కారణం చూపుతూ ఉద్యోగం ఇవ్వలేదు. నాలా చాలా మంది నష్టపోతున్నారు. తెలంగాణలోని కన్నడ మీడియం పాఠశాలల మూలంగా ఇటు తెలంగాణ, అటు కర్ణాటకలో నష్టపోతున్నాం. ఈ విషయంలో రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు తగు నిర్ణయం తీసుకోవాలి.

– భీంసీ, కృష్ణా

బడుల బలోపేతానికి కృషి..



రాష్ట్రంలోని కన్నడ మీడియం పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నాం. అందుకు అటు కర్ణాటక, ఇటు తెలంగాణ ప్రభుత్వంతో పోరాడుతున్నాం. గతంలో కృష్ణా ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి కర్ణాటక ప్రభుత్వం నిధులు కేటాయించింది. గడినాడ విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో 'వరనాడు' ద్వారా ప్రత్యేక రిజర్వేషన్లు అమలుచేస్తుంది. దాంతో పాటు హాస్టల్ సౌకర్యం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశాం.

– రాంలింగప్ప, గడినాడ కన్నడ సంఘం అధ్యక్షుడు, కున్సీ

పోరాడుతున్నాం..



కన్నడ భాషపై ఉన్న అభిమానంతో తాము కన్నడ మీడియం పాఠశాలలను అన్నివిధాలుగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నాం. మూతపడిన రెండు కన్నడ మీడియం పాఠశాలలను పునఃప్రారంభించేందుకు స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఆయన చొరవతో ఆ పాఠశాలలను త్వరలోనే పునరుద్ధరిస్తాం.

– నిజాముద్దీన్, ఎంఈఓ, గడినాడ కన్నడ సంఘం గౌరవాధ్యక్షుడు, కృష్ణా

మూతపడిన ప్రాథమిక పాఠశాలలు..

కృష్ణా మండలం సూకూర్ లింగంపల్లి, అడవి ఖానాపూర్ గ్రామాల్లోని కన్నడ మీడియం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు చేరకపోవడంతో మూతపడ్డాయి. ఆ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి చదివితే లోకల్ కిందకు వస్తామనే కారణంతోనే ఆయా గ్రామాల పిల్లలను కర్ణాటకలోని బాడియాల్, గూడూర్ ఉన్నత పాఠశాలలకు పంపిస్తున్నారు. అయితే మూతపడిన పాఠశాలలను పునఃప్రారంభించేందుకు ఆయా గ్రామాల ప్రజలతో ఎంఈఓ నిజాముద్దీన్ కొన్ని రోజులుగా ప్రయత్నిస్తున్నారు.

ప్రపంచ దేశాల్లో శాంతి కరువు


సొంతూరు, అవిలివల పుస్తకాలను ఆవిష్కరించిన ప్రొ.హరగోపాల్

- ఏఐతో మరింత విధ్వంసం తప్పదు
- సొంతూరు, అవిలివల పుస్తకాల ఆవిష్కరణ సభలో ప్రొ.హరగోపాల్

జడ్చర్ల టౌన్: ప్రపంచంలోని ఏ దేశంలో చూసినా హింస, విధ్వంసం, దుఃఖం గోచరిస్తుందని ఉదయమిత్ర అనువాదించిన సొంతూరు కవితల ద్వారా మరోసారి అవగతమవుతుందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివారం పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో జడ్చర్ల పట్టణంలోని డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కవి ఉదయమిత్ర అనువాదించిన సొంతూరు, అవిలివల పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోని ఏ దేశంలో అయినా శాంతి కరువైందని.. హింస, ప్రాణనష్టం, కోల్పోతున్న విలువలు, యుద్ధ వాతావరణం కనిపిస్తున్నాయన్నారు. దేశాల పరిస్థితులపై ప్రపంచవ్యాప్తంగా కవులు స్పందిస్తున్నారని.. వారి కవిత్వంలో మానవీయ విలువలు గోచరిస్తున్నాయన్నారు. అమానవీయ ప్రపంచంలో ఉన్నట్టుగా కవులు బలంగా తమ వాదనలు వినిపిస్తున్నారని.. వారు క్షుణ్ణంగా జీవితానుభవాలను వెలిబుచ్చుతున్నారని అన్నారు. ఆయా దేశాల కవులు రచించిన కవితలు, రచనలను ఉదయమిత్ర సొంతూరులో అనువాదించడం అభినందనీయమన్నారు. సాహిత్యం చరిత్ర చూస్తే 1930లో గొప్పగా కనిపిస్తుందన్నారు. ఆ కాలంలో శ్రీశ్రీది విప్లవ కవిత్వం అయితే.. కృష్ణశాస్త్రిది భావకవిత్వమన్నారు. అయితే కాలక్రమేణ భావకవిత్వం కనుమరుగైందని.. ఇప్పుడు అలాంటివారు కనిపించరన్నారు. ప్రకృతి రమణీయతను వర్ణించే కవులు లేరన్నారు. ప్రస్తుతం ప్రకృతిలోని విధ్వంసాన్ని చూస్తున్నామని, కవులు వినిపిస్తున్నారన్నారు. అవిలివలలో సాంకేతికత వల్ల జరిగిన నష్టం గురించి వివరించారన్నారు. ఏఐ ద్వారా భవిష్యత్ ఏమవుతుందో అర్థం కావడం లేదన్నారు. టెక్నాలజీ అమానవీయంగా మారితే ఎలాంటి దుష్పరిణామాలు సంభవిస్తాయో అంతుపట్టకుండా ఉందన్నారు. సాంకేతికత విధ్వంసం సృష్టించడం ఖాయమన్నారు. వాస్తవ జీవితంలో కలిగిన సంఘటనలు, అనుభవాలను కవితల రూపంలో ఉదయమిత్ర తీసుకువచ్చారని కొనియాడారు. కాగా, సొంతూరు పుస్తకాన్ని శ్రీరామ్ పుష్పాల, సతీశ్ బైరెడ్డిలు పరిచయం చేయగా.. అవిలివల పుస్తకాన్ని డా.సుభాషిణి, నారాయణ పరిచయం చేశారు. పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, జనజ్వాల, చాంద్‌ఖాన్, ఖలీల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డీ–1 ప్రదేశంలో తవ్వకాలు


సొరంగంలో చేపడుతున్న సహాయక చర్యలు

అచ్చంపేట: ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదం జరిగిన డీ–1 ప్రదేశంలో మరో 25 మీటర్లు మేర శిథిలాలను తొలగించేందుకు రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నారు. డీ–2 ప్రదేశంలో శిథిలాలు, మట్టి తొలగింపు పనులు దాదాపుగా పూర్తికావడంతో గల్లంతైన కార్మికులు నిషేధిత ప్రదేశంలోనే ఉన్నట్లు సహాయక బృందాల ఉన్నతాధికారులు నిర్ధారణకు వచ్చారు. డేంజర్ జోన్‌లో ఇప్పట్లో సహాయక చర్యలు చేపట్టే అవకాశం కనిపించడం లేదు. గత ఫిబ్రవరి 22న సొరంగంలో ప్రమాదం జరిగిన నాటి నుంచి 58 రోజులపాటు నిరంతరాయంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఆదివారం నిషేధిత ప్రదేశం సమీపంలో మట్టి, రాళ్లు, శిథిలాల తొలగింపు పనులు చేపట్టారు. ఆ ప్రదేశంలో టీబీఎం భాగాలు కత్తిరించే పని ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. కీలకమైన స్టీల్ భాగాలను తొలగిస్తే మరో వారం రోజుల్లో శిథిలాల తొలగింపు పనులు పూర్తవుతాయని సిబ్బంది చెబుతున్నారు. గల్లంతైన కార్మికుల ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ సిబ్బంది, హైడ్రా, దక్షిణమధ్య రైల్వే, ఆర్మీ వంటి 12 విభాగాలకు చెందిన 450 మంది సిబ్బంది నిరంతరాయంగా శ్రమిస్తున్నారు. షిఫ్ట్‌ల వారీగా కొంత మంది సిబ్బంది వెళ్లిపోగా.. వారి స్థానంలో కొత్తవారు వచ్చి సహాయక చర్యలు చేపడుతున్నారు. థర్మల్ కట్టర్‌తో కట్ చేసిన టీబీఎం స్టీల్ భాగాలు, బండరాళ్లను లోకో ట్రైన్ ద్వారా.. మట్టి, బురదను కన్వేయర్ బెల్టుపై సొరంగం బయటకు తరలిస్తున్నారు. సొరంగం పైకప్పు కూలిన ప్రదేశం నుంచి ఉబ్బికి వస్తున్న నీటి ఊటను 150 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటార్లతో బయటకు తోడేస్తున్నారు.

హిటాచీ వాహనం దగ్ధం


దగ్ధమవుతున్న హిటాచీ వాహనం

నారాయణపేట రూరల్: రోజురోజుకు ఎండలు తీవ్రతరమవుతున్న నేపథ్యంలో మనుషులతో పాటు వాహనాలు సైతం తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. తాజాగా ఓ హిటాచీ వాహనం దగ్ధమైన ఘటన నారాయణపేట జిల్లాలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గుండుమల్ మండల కేంద్రం నుంచి నారాయణపేట మండలం కోటకొండ వరకు డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం హిటాచీ వాహనంతో బండగొండ సమీపంలో రోడ్డును తవ్వుతుండగా.. మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రతకు వాహనంలోని బ్యాటరీలు, ఆయిల్ విపరీతమైన వేడికి గురయ్యాయి. దీంతో వాహనంలో నుంచి పొగలు రావడంతో భయపడి అప్రమత్తమైన ఆపరేటర్ ఆంజనేయులు వెంటనే వాహనం నుంచి దిగి దూరంగా పరిగెత్తాడు. అంతలోనే మంటలు వ్యాపించి వాహనం పూర్తిగా కాలిపోయింది. ఫైరింజన్ అక్కడికి చేరుకున్నా ఫలితం లేకపోయింది. ప్రమాదంలో సుమారు రూ. 20లక్షలనష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

సీఎంబీ చర్చి మహిళలకు అరుదైన గౌరవం

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లాకేంద్రంలోని సెంటినరి ఎంబీ చర్చి మహిళలకు అరుదైన గౌరవం దక్కింది. గత నెలలో కర్నూలులోని రిమా కన్వెన్షన్ సెంటర్‌లో బైబిల్ రీడింగ్ చాలెంజ్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌ను కేవలం 8 గంటల వ్యవధిలో చేతితో రాసినందుకుగాను ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కినట్లు చర్చి కమిటి సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ పోటీలకు దేశంలోని 1,505 మంది క్రైస్తవ మహిళలను ఆహ్వానించగా.. జిల్లాకేంద్రంలోని చర్చి నుంచి 25 మంది మహిళలు పాల్గొన్నారని చెప్పారు. ప్రపంచంలో మొదటిసారి నమోదైన రికార్డుగా నిర్వాహకులు జూలీ ఫ్రాన్సిస్ మేరి, ప్రశాంతి కందూరి వివరించారు.

రామన్‌పాడులో 1,015 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో ఆదివారం 1,015 అడుగులకు నీటిమట్టం చేరిందని ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేసినట్లు పేర్కొన్నారు. రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వకు రెండు క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 20 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

వరి కోతల్లో జాగ్రత్తలు తప్పనిసరి


వరి కోత యంత్రంతో పంట కోత

- చిన్నపాటి మెళకువలతో నాణ్యమైన దిగుబడి

పాడి-పంట

నారాయణపేట జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్ సుధాకర్

కోస్గి: యాసంగి వరి పంటలు కోత దశకు చేరుకోగా.. ముందుగా సాగుచేసిన పంటల కోతలు ప్రారంభమయ్యాయి. వరి కోతలు, కోతల అనంతరం కొన్ని మెళకువలు పాటిస్తే నాణ్యమైన దిగుబడి పొందవచ్చని నారాయణపేట జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్ సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, జాగ్రత్తలు వివరించారు.

- పొలంలో 80 నుంచి 90 శాతం వరి వెన్నులు పసుపురంగుకు మారుతున్న సమయంలో పంట కోయాలి. పూర్తిగా ఎండిపోయే వరకు ఉంచరాదు. ఈ దశలో గింజల్లో 18 నుంచి 20 శాతం తేమ ఉంటుంది.
- కోత ఆలస్యమైతే గింజ పగుళ్లు వచ్చి ధాన్యం నూకలయ్యే ప్రమాదం ఉంది.
- గింజల్లో తేమశాతాన్ని తగ్గించడానికి 2 నుంచి 3 రోజులు మెదను ఎండనివ్వాలి. ఒకవేళ వర్షం కురిసి తడిస్తే 5 శాతం ఉప్పు ద్రావణాన్ని వరిపై పిచికారీ చేయాలి.
- వరి కోత యాంత్రాలతో కోతలు చేస్తే దుమ్ము, మట్టిపెడ్డలు ధాన్యంలో కలవకుండా జాగ్రత్త పడాలి. రెండు వేర్వేరు రకాల ధాన్యం కలవకుండా చూసుకోవాలి.

పంట కోతల తర్వాత..

- ధాన్యాన్ని తుర్పారబట్టి చెత్త, మట్టి, రాళ్లు వేరు చేయాలి.
- తుర్పారబట్టిన ధాన్యంలో తేమశాతం 12 నుంచి 14 వరకు తగ్గే వరకు ఆరబెట్టాలి. ఈ విధంగా చేయడంతో ధాన్యం ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.
- చౌడు నేలల్లో పండించిన ధాన్యాన్ని మంచి ధాన్యంతో కలపరాదు.
- చీడపీడలు ఆశించినా, రంగు మారినా జాగ్రత్తలు తీసుకోవాలి. ధాన్యంలో కలుపు మొక్కల గింజలు లేకుండా చూడాలి.

నిల్వలో జాగ్రత్తలు..


- ధాన్యాన్ని నిల్వ చేసేటప్పుడు అధిక తేమశాతం లేకుండా చూసుకోవడం మంచిది.
- ధాన్యాన్ని ఆశించే కీటకాల నుంచి రక్షణ కోసం పరిసరాల్లో పొగబెట్టాలి.
- శుభ్రమైన గోనె సంచులు, గుమ్ముల్లో ధాన్యం నిల్వ చేయాలి. అదేవిధంగా ఎలుకలు, సూక్ష్మ జీవులు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ధాన్యం నిల్వ చేసే ప్రదేశం తడి లేకుండా, బస్తాలకు చిల్లులు లేకుండా చూసుకోవాలి.

బైక్‌తో ఢీ.. వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని ద్విచక్ర వాహనదారుడు వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని షాషాబ్‌గుట్టకు చెందిన ముక్తార్ బేగ్(56) శనివారం రాత్రి 10.30గంటల ప్రాంతంలో పట్టణంలోని విద్యుత్ ఆఫీస్ ఎదుట రోడ్డు దాటుతున్న క్రమంలో టంకరకు చెందిన శ్రీరామ్ బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ముక్తార్‌బేగ్‌ను జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య నఫీస్ సుల్తానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

సర్వీస్ వైరు సరిచేస్తుండగా.. విద్యుదాఘాతం

- స్తంభంపైనే మృతి చెందిన దినసరి కూలీ



మహబూబ్‌నగర్ క్రైం: విద్యుత్ తీగలపై చెట్టు కొమ్మలు తొలగించే కూలీ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. వన్‌టౌన్ సీఐ అప్పయ్య కథనం ప్రకారం..హన్వాడ మండల టంకర గ్రామానికి చెందిన వర్లదాసు(51) కొన్ని రోజుల నుంచి విద్యుత్ శాఖకు చెందిన విద్యుత్ తీగలకు చెట్లు ఉన్న ప్రాంతాల్లో వాటిని తొలగించడం కోసం కాంట్రాక్టర్ పవన్‌కుమార్ వద్ద దినసరి కూలీగా పని చేస్తున్నాడు. అయితే ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో జిల్లాకేంద్రంలోని రాం మందిర్ చౌరస్తా ఏరియాలో చెట్లు విద్యుత్ తీగలకు సమీపంలో ఉండటంతో.. కొమ్మలు తొలగిస్తున్న క్రమంలో కొన్ని కొమ్మలు తీగలపై పడ్డాయి. దీంతో వర్లదాస్ విద్యుత్ సరఫరా బంద్ చేసి.. స్తంభం ఎక్కి తొలగిస్తున్న క్రమంలో ఓ సర్వీస్‌వైర్ తెగిపోయింది. దానిని తిరిగి అతికిస్తున్న సమయంలో ఒక ఇంటికి ఉన్న ఇన్వేటర్ ద్వారా సర్వీస్ వైర్ నుంచి విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి స్తంభంపైనే మృతి చెందాడు. మృతుడు భార్య వర్ల దానమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.